క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్, కోర్టురోడ్డు, ఫారెస్టు కార్యాలయం, ఎన్‌జీఓఎస్ కాలనీల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్ శాఖ అధికారి ఎం.సదాశివ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్‌లో ప్రీమాన్సూన్ ఇన్‌స్పెక్షన్ ప్రోగ్రాం ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జైనూర్: మరమ్మతుల కారణంగా గురువారం మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాదిక్ మియా అన్నారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు చేపడుతుండటంతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి తొలగింపు



మాట్లాడుతున్న డీసీవో రబ్బాని

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసం చేస్తున్నారంటూ రైతులు మంగళవారం ఆందోళన చేయగా, బుధవారం డీసీవో రబ్బాని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తూకంలో అదనంగా కిలో తూకం వేయడంతో మోసపోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి తుమ్మిడె నారాయణను తొలగించినట్లు పేర్కొన్నారు. అతని సస్పెన్షన్ కోసం జిల్లా ఉన్నతాధికారులకు, జిల్లా కమిటీకి నివేదిక పంపించామన్నారు. ఒడ్డుగూడ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిగా సీఈవో బక్కయ్యకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తూకంలో మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోటార్ బాగు చేయరూ..!



చెడిపోయిన మోటార్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామ పంచాయతీ కొత్తగూడ ఎస్సీ కాలనీలో బోర్ మోటార్ చెడిపోవడంతో కాలనీవాసులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా నీటి కోసం సమీపంలో ఉన్న పొలాల్లోకి బిందెలతో వెళ్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

నేడు సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో క్రిష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉపాధిపనులు, కూలీల సంఖ్య పెంచడం, వేతనధరలు, హరితహారం, నర్సరీలు తదితర అంశాలపై సమావేశం ఉంటుందని, కార్యక్రమానికి అటవీ సెక్షన్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం టీఏలు, ఎఫ్ఏలు సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

అధికారుల ఆడిట్



బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు బుధవారం అడిట్ నిర్వహించారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో లావాదేవీలు, పలు వివరాలు, చేసిన పనులతో ఇతర అంశాలపై అడిట్ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి అడిట్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో అడిట్ అధికారులు సల్లావుద్దీన్, ఖలీమ్, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నార మనోహర్, సిబ్బంది స్వామి, ముఖీద్ ఉన్నారు.

గాడితప్పిన లక్ష్యం



బెజ్జూర్ మండలంలోని రైతువేదిక భవనం

- మోయలేని భారంగా రైతువేదికల నిర్వహణ
- రెండేళ్లుగా నిధులు లేక అస్తవ్యస్తం
- విద్యుత్ బిల్లులు కట్టలేని వైనం

బెజ్జూర్: రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన రైతువేదికల లక్ష్యం గాడి తప్పుతోంది. ప్రభుత్వం నుంచి గత రెండేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ బిల్లులు, ఇతర పనులు సొంత డబ్బులతో చేయాల్సి వస్తుండడంతో వ్యవసాయ విస్తరణ అధికారులకు తలకుమించిన భారంగా మారింది. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించడం, పంటల సాగులో అవసరమయ్యే సలహాలు, సూచనలు ఇవ్వడానికి 2021లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించారు. ఒక్కో రైతువేదికను రూ.22 లక్షలతో నిర్మించారు. ఒక్కో వేదికకు ఎంఈవోను నియమించారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా వేదికలో వసతి కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నిచర్‌ను సమకూర్చారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైకు వంటివి ఏర్పాటు చేశారు. వీటిని వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలు కూడా వినియోగించుకున్నాయి. ఊరికి దూరంగా నిర్మించిన రైతువేదికల్లో పారిశుధ్యం తదితర పనులకు సహాయకుడిని ప్రభుత్వం నియమించకపోవడంతో విలువైన సామగ్రి దొంగల పాలయ్యేది. ఎంఈవోలే తమ సొంత ఖర్చుతో వాచ్‌మెన్లను ఏర్పాటు చేశారు.

నిర్వహణ అస్తవ్యస్తం..

రైతువేదికల నిర్వహణ కోసం నెలల తరబడి నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు దశలోనైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆశించినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. రానున్న వానాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని నిధులు విడుదల చేయాల్సిన అవసరముంది. రైతువేదిక నిర్వహణ నిధులపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయని కారణంగా తామే సొంతంగా డబ్బులు పెడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంతంగా..

రైతువేదికల్లో మంచినీరు, విద్యుత్, పారిశుద్యం వంటి నిర్వహణ ఖర్చుల నిమిత్తం ప్రతినెలా రూ.3వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ రెండేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో పలు ప్రాంతాల్లో సంబంధిత అధికారులు కొందరు వారి వేతనం నుంచి ఖర్చులు చేస్తున్నారు. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఒక్కో రైతు వేదికకు రూ.45వేలు అందించింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. జిల్లాలో 70 రైతు వేదికలు ఉండగా, కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

మోయలేని భారంగా..

రైతువేదికల నిర్వహణ వ్యవసాయ విస్తరణ అధికారులకు తలకుమించిన భారంగా మారుతోంది. విద్యుత్ చార్జీలకు రూ.వెయ్యి, స్టేషనరీ జిరాక్స్‌లకు రూ.వెయ్యి, శిక్షణా కార్యక్రమాలకు రూ.2500, తాగునీటి కోసం రూ.5వేలు, పరిశుభ్రత, వాచ్‌మెన్‌ల కోసం రూ.3వేలు ప్రతినెలా ఖర్చవుతున్నాయి. కరెంట్ బిల్లుల విషయంలో మరీ ఒత్తిడి పెరుగుతోంది. సకాలంలో బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని, దీంతో విధిలేని పరిస్థితుల్లో తామే డబ్బులు చెల్లిస్తున్నామని పేర్కొంటున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని చెబుతున్నారని పేర్కొంటున్నారు.

త్వరలో నిధులు..

ప్రభుత్వం నుంచి త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. రైతువేదికల నిర్వహణకు సంబంధించి నిధుల కోసం ప్రతినెలా ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కొత్త ప్రభుత్వంలో నిధులు విడుదలై సమస్య పరిష్కారమవుతుంది.

– రాజుల నాయుడు, ఏవో

పచ్చని గూడు



భీంపూర్ మండలంలోని నిపాని గ్రామశివారులోని అంతర్రాష్ట్ర రోడ్డుపై చెట్లు ఏపుగా పెరిగి, పచ్చని గూడులా ఆకట్టుకుంటున్నాయి. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వచ్చిపోయే వాహనదారులకు, బాటసారులకు ఆహ్లాదం పంచుతున్నాయి. – తాంసి

ఒక్కటైన ప్రేమ జంట



గ్రామస్తుల సమక్షంలో ఒక్కటైన ప్రేమ జంట

బెజ్జూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామంలో కులాంతర వివాహానికి కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో గ్రామస్తులే ప్రేమ వివాహం జరిపించిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎస్టీ కులానికి చెందిన ముంజంపల్లి గ్రామస్తుడు జంబుల చిలకయ్య, కౌటాల మండలం ముత్యంపేట్ గ్రామంలోని బీసీ కులానికి చెందిన వడై పూజ గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయాన్ని ఇరువురు కుటుంబ సభ్యులకు తెలియజేసినప్పటికీ వారు కులాంతర వివాహానికి ఒప్పుకోలేదు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలుపడంతో బుధవారం ముంజంపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు వారివురు ప్రేమ వివాహాన్ని జరిపించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అశోక్, సత్యనారాయణ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న హిందూవాహిని సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండల కేంద్రంలో సోమవారం హిందూ కుటుంబాలపై దాడులకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరంగా శిక్షించాలని హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చిన్న కారణాలతో దాదాపు 500 మందితో ఒడ్డెరగూడలో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గొడవలు జరగడానికి గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. దాడుల్లో గాయపడిన వారిని పరామర్శించడానికి గురువారం హిందూవాహిని ఆధ్వర్యంలో జైనూర్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డల ప్రణయ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, తదితరులు ఉన్నారు.

రెండోరోజు బంద్ ప్రశాంతం

జైనూర్: ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల కారణంగా కొనసాగుతున్న 144 సెక్షన్ రెండో రోజు అమలైంది. మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకున్న ఘర్షణలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పటు చేయడంతో పాటు దుకాణ సముదాయాల వ్యాపారులు సంపూర్ణ బంద్ నిర్వహించారు.

గుంతతో పొంచి ఉన్న ప్రమాదం



పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ -సలుగుపల్లి ప్రధాన రహదారిపై లోడుపల్లి -బొక్కివాగు వద్ద రోడ్డు కోతకు గురి కావడంతో పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం ద్విచక్రవాహనదారులతో పాటు ప్రైవేట్ వాహనదారులు ఈ రోడ్డు గుండా పగలు, రాత్రి ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతతో ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

అల్లాడుతున్న మూగజీవాలు

- మేత దొరక్క విలవిల
- ఎడారిని తలపిస్తున్న పొలాలు
- పశుగ్రాసం కొనుగోలు చేస్తున్న రైతులు



వరిగడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతు



మేతకోసం వెతుకులాటలో మూగజీవాలు

దహెగాం: వేసవి వచ్చిందంటే చాలు మూగజీవాలు పశుగ్రాసం కోసం అల్లాడుతున్నాయి. వేసవిలో ఎటు మేతకు వెళ్లినా వాటికి పచ్చగడ్డి దొరకడం లేదు. ఎండు గడ్డి, ఆకులు అలమలు తిని పొట్ట నింపుకుంటున్నాయి. రైతులు మూగజీవాలను ఉదయం పూట మేతకు వదులుతారు. మేతకు వెళ్లిన పశువులకు ఎక్కడ కూడా పశుగ్రాసం దొరకడం లేదు. దీంతో ఎండిపోయిన ఆకులు, పొలం గట్లపై ఉన్న గడ్డి మేస్తున్నాయి. పొలాల్లో వరిగడ్డి మేసి కడుపు నింపుకొని మధ్యాహ్నం వరకు ఇళ్లకు చేరుకుంటున్నాయి. ఇళ్లకు వచ్చిన పశువులకు రైతులు దాహం తీరుస్తున్నారు.

వరి గడ్డిని కొనుగోలు చేస్తున్న రైతులు..

మానవుడికి మూగజీవాలతో ఎంతగానో అనుసంధానం ఉంటుంది. పొలం దుక్కి పెట్టాలన్నా, పొలంలో పండిన పంటను ఇంటికి చేర్చాలన్నా, మూగజీవాలతో రోజువారిగా అన్నదాతలకు నిత్యం పని ఉంటుంది. ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం వరకు మూగజీవాలతో గడిపే అన్నదాతలు ఉన్నారు. మూగజీవాలకు వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడుతున్నందున రైతులు ఎండు వరిగడ్డిని కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. వచ్చే నెలలో ఖరీఫ్ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పనుల సమయంలో పశువులకు పశుగ్రాసం లేకుంటే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో ముందుగానే రైతులు వరిగడ్డి కొనుగోలు చేస్తున్నారు. ఎకరం వరిగడ్డిని రూ. వెయ్యి నుంచి రూ. రెండు వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు చేసిన గడ్డిని ట్రాక్టర్‌లో తరలించడానికి రెండు వేల వరకు ఖర్చు అవుతుందని వాపోతున్నారు. పశువులకు మేత దొరక్క పోవడంతో వరిగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

మండలంలో 33,041 పశువులు..

మండలంలో 33,041 పశువులు ఉన్నాయని పశు వైద్య శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పశువులకు మేత దొరక్క పోవడంతో రైతులు ఉన్న పశువులను విక్రయించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. పశువులకు మేత లభించక పోవడంతో మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు తిని మృత్యువాత పడుతున్నాయి. ఆకలికి అలమటించి పోతున్నాయి. నాడు పశువులకు వేసవిలో పశుగ్రాసం దొరకదని ముందుగానే రైతులు కంది, పెసర, జొన్న, మొక్కజొన్న ఇళ్లలో నిల్వ చేసుకోని వేసవిలో ఉదయం, సాయంత్రం పశువులకు అందించేవారు. ప్రస్తుతం అలాంటి పంటలు పండించక, అధికంగా పత్తి సాగు చేస్తున్నారు. దీంతో రానురాను పశువులకు మేత దొరకని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ప్రతీ ఇంట్లో ఆవు, గేదె ఉండగా వాటి కోసం పశుగ్రాసం అందుబాటులో ఉంచుకొని వాటి ఆకలి తీర్చేవారు. ప్రస్తుతం ఇళ్లలో చాలామంది పశుగ్రాసం నిల్వ చేసుకోవడం లేదు. దీంతో మూగజీవాలు పశుగ్రాసం కోసం అల్లాడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పశుసంపదపై దృష్టి సారించి పశువులకు పశుగ్రాసం వేసవిలో దొరికే విధంగా చర్యలు తీసుకోవాలని మూగజీవాల ప్రేమికులు, రైతులు కోరుతున్నారు.

పల్లెల్లో జోరుగా పోలింగ్

- పట్టణాల్లో కనిపించని ఓటు చైతన్యం
- ఆదర్శంగా నిలుస్తున్న పల్లె జనం



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

బోథ్: పార్లమెంట్ ఎన్నికల్లో పల్లె ప్రజల్లో ఓటు చైతన్యం కనిపించింది. పట్టణాలతో పోలిస్తే పల్లెల్లోనే ఎక్కువగా పోలింగ్ శాతం నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. పట్టణ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు నిరాసక్తత కనబర్చారు. పల్లెలో మాత్రం పోలింగ్ జోరు సాగింది. బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 2,11,313 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 1,65,157 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకర్గ వ్యాప్తంగా 78.16 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో మహిళలు 83062 (76.30 శాతం), పురుషులు 82094 (80.12) శాతం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

పల్లెలు ఆదర్శం..

ఓటింగ్‌ను వినియోగించుకోవడంలో పల్లెలు పట్టణాలకు ఆదర్శంగా నిలిచాయి. పార్లమెంట్ ఎన్నికల్లో పల్లెల్లోని ఓటర్లు 80 నుంచి 90 శాతానికి పైగా ఓటు వేశారు. నియోజవర్గంలోని ఆడెగాం(బి) లో 482 ఓటర్లు ఉండగా.. 450 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 93.36 శాతం పోలింగ్ నమోదైంది. సల్యాద గ్రామంలో 376 మంది ఓటర్లు ఉండగా.. 351 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 93.35 ఓటింగ్ శాతం నమోదైంది. జోగిపేటలో 93.33, కోసాయిలో 92.54, రత్నాపూర్‌లో 92.06, గాజిలిలో 91.25, షేకుగూడలో 90.58, పల్సి(బి)లో 90.37, అంబూగాం 90.30, శకినాపూర్‌లో 90.19 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో పది పోలింగ్ కేంద్రాలో 90 శాతం కన్నా ఎక్కువగా పోలింగ్ నమోదుకాగా.. 140 పోలింగ్ కేంద్రాల్లో 80 నుంచి 89 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రాలన్నీ ఎక్కువగా ఆదివాసీ, గిరిజన గ్రామాల్లోనే పోలింగ్ కేంద్రాలు కావడం గమనార్హం.

పట్టణాల్లో తక్కువగా ఓటింగ్..

పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఇచ్చోడ మండల కేంద్రంలోని 131వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 58.33 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రంలో 660 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 385 మంది మాత్రమే తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇచ్చోడలోని మరో పోలింగ్ కేంద్రం 132లో 61.30 శాతం పోలింగ్ నమోదైంది. వెంకటాపూర్‌లో 61.56, ఇచ్చోడలోని 137వ పోలింగ్ కేంద్రంలో 62.07, డెడ్రాలో 62.12, బుగ్గారాం కెలో 64.54, ఇచ్చోడలోని 136వ పోలింగ్ కేంద్రంలో 65.12, 130వ కేంద్రంలో 62.41 శాతం పోలింగ్ నమోదైంది. బోథ్ మండల కేంద్రంలోని 257వ పోలింగ్ కేంద్రంలో 66.12, 251వ పోలింగ్ కేంద్రంలో 66.21 శాతం పోలింగ్ నమోదైంది. మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది.

పెరిగిన ఓటింగ్..

గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగిన ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరిగింది. 2019 ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో 1,47,137 ఓట్లు పోలవగా.. ఈసారి 1,65,157 ఓట్లు పోలయ్యాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో 76.09 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి 78.16 శాతం ఓట్లు పోలయ్యాయి.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ రాథోడ్ సజన్

నేరడిగొండ: అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేశానని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మాట్లాడారు. ఐదు సంవత్సరాల కాలంలో మండల అభివృద్ధికి కృషి చేశానని, అధికారులు, నాయకులు, ప్రజల సహకారంతో ముందుకు వెళ్లడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ఉన్నందున అధికారులు గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ లాలు, ఎంపీటీసీలు అంబేకర్ పండరి, సవిత, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.